సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం । 26 । జూలై । 2023



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి. మార్కెట్‌కు 910 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.123

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.123 పలికింది. కనిష్టం రూ.96, సరాసరి రూ.105 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
29.8°/21.2°

జిల్లాలో మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. తుపాను వాతావరణం నెలకొంది. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

ఉమ్మడి జిల్లాకు 37 విద్యుత్ సబ్ స్టేషన్లు

- రూ.95కోట్ల నిధులు మంజూరు

అనంతపురం టౌన్: విద్యుత్ అంతరాయాలు అరికట్టి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో కొత్తగా 37 సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్ర తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన సబ్ డివిజన్ల ఈఈలతో టెలీకాన్ఫరెన్సు నిర్వహించారు. ప్రతి సబ్ డివిజన్ పరిధిలో 5 సబ్ స్టేషన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. మొత్తం 37 సబ్ స్టేషన్లకు రూ.95 కోట్లమేర నిధులు మంజూరైనట్లు చెప్పారు. సబ్ స్టేషన్ల నిర్మాణ పనులను వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. లో ఓల్టేజీ సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలను పంపాలన్నారు. అనంతపురం డివిజన్ పరిధిలో ఉప్పరపల్లి, కొడిమి, ఆలమూరు తదితర ప్రాంతాల్లో నూతన సబ్ స్టేషన్లు మంజూరైనట్లు వెల్లడించారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో స్థలాలను గుర్తించినట్లు తెలిపారు. త్వరలో నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు.

జిల్లా అంతటా వాన



పుట్టపర్తిలో కురుస్తున్న వర్షం

పుట్టపర్తి అర్బన్: తుపాను ప్రభావంతో గత రెండు రోజులుగా జిల్లా అంతటా తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం ఒక్కరోజే 26 మండలాల పరిధిలో 178.8 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా గోరంట్ల మండలంలో 21.4 మి.మీ వర్షం కురిసింది. ఇక గుడిబండ మండలంలో 16.2 మి.మీ, హిందూపురం 14.2 మి.మీ, చిలమత్తూరు 12.2 మి.మీ, సోమందేపల్లి 11.2 మి.మీ, మడకశిర 10.4 మి.మీ, పెనుకొండ 10.2 మి.మీ, పరిగి 9.6 మి.మీ, రొద్దం 9 మి.మీ, అమరాపురం 8.2 మి.మీ, లేపాక్షి 7.4 మి.మీ, బుక్కపట్నం, పుట్టపర్తి 6.6 మి.మీ, కొత్తచెరువు 6.2 మి.మీ, అగళి 4.2 మి.మీ, అమడగూరు 3.4 మి.మీ, సీకేపల్లి, రామగిరి, రొళ్ల 3.2 మి.మీ, తాడిమర్రి, ఓడీ చెరువు, కదిరి మండలాల్లో 2.2 మి.మీ మేర వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. తాజాగా వర్షాలు ఖరీఫ్ సాగుకు ఎంతో ఉపకరిస్తాయని తెలిపారు. ఈ నెలాఖరు వరకూ విత్తనం వేసుకునేందుకు అనువుగా ఉన్న నేపథ్యంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ పంటలు భారీగా సాగులోకి రానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

ఆహ్లాదం.. ఆనందం

అరుదైన వృక్షాలు.. పక్షుల కిలకిల రావాలు.. వన్యప్రాణుల కేరింతలు... ఇలాంటి ప్రకృతి రమణీయ దృశ్యాలను పచ్చిక బయలులో కూర్చుని చూడాలని ఎవరికి మాత్రం ఉండదు. కానీ నిత్యం ఉరుకుల పరుగుల జీవితం గడిపే నగరవాసికి అలాంటి అవకాశం చాలా తక్కువ. అందువల్లే నిత్యం ఒత్తిడితో గడిపే నగరవాసికి ఆహ్లాదం పంచేందుకు జగన్ సర్కార్ సిద్ధమైంది. అటవీ భూముల పరిరక్షణతో పాటు ప్రజల ఆహ్లాదం కోసం త్వరలోనే 'నగర వనం' పేరుతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో పార్కులు ఏర్పాటు చేస్తోంది.

జిల్లాలో నాలుగు నగరవనాల ఏర్పాటుకు సర్కార్ శ్రీకారం

- కదిరి, పుట్టపర్తి, పెనుకొండ నియోజకవర్గాలు ఎంపిక
- ఒక్కోచోట 50 హెక్టార్లలో ఏర్పాటుకు అటవీశాఖ సన్నాహాలు
- నగర వనాల్లో కనువిందు చేయనున్న ప్రకృతి అందాలు

కదిరి: ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కాంక్రీట్ జంగిల్‌లో బతికే పట్టణ వాసులు ప్రకృతి మధ్య సేదదీరేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందుకోసం జిల్లాలో నాలుగు నగర వనాల ఏర్పాటుకు జిల్లా అటవీశాఖ అధికారులు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపారు. కదిరి–పులివెందుల రహదారిని ఆనుకుని తలుపుల మండలం బత్రేపల్లి జలపాతం వద్ద ఒకటి, పుట్టపర్తి నియోజకవర్గంలోని పుట్టపర్తి మండలం అమగొండపాళ్యం అటవీ ప్రాంతంలో మరొకటి, పెనుకొండ నియోజకవర్గ కేంద్రంలోని కోటలో ఇంకొకటి, అలాగే పెనుకొండ నియోజకవర్గంలోని సోమందేపల్లి వద్ద మరో నగర వనం ఏర్పాటు చేయాలని అటవీశాఖ అధికారులు నిర్ణయించారు.

50 హెక్టార్ల విస్తీర్ణంలో ఏర్పాటు..

ఒక్కో నగర వనం 50 హెక్టార్లలో ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం మొదటి విడతలో హెక్టారుకు రూ.4 లక్షలు చొప్పున 50 హెక్టార్లకు రూ.2 కోట్లు ఖర్చు చేసేందుకు ఇప్పటికే ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఇలా నాలుగు నగర వనాలకు రూ.8 కోట్లు ఖర్చు చేయనున్నారు. పూర్తి స్థాయిలో ఒక్కో నగర వనం ఏర్పాటుకు రూ. 50 కోట్లు చొప్పున నిధులు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో కేంద్ర ప్రభుత్వ అటవీశాఖ సైతం కొంత మేరకు నిధులు విడుదల చేయనుంది. వీటి పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే అటవీశాఖ అధికారులు ఆయా ప్రాంతాల్లో పర్యటించి నగర వనాల ఏర్పాటుకు అటవీ భూములను ఎంపిక చేశారు.



నగరవనం ప్రవేశ ద్వారం నమూనా

రోజంతా ఆహ్లాదంగా గడపవచ్చు..

నగర వనాలు ఏర్పాటైతే పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా రోజంతా అక్కడ ఉల్లాసంగా గడపవచ్చు. ఓపెన్ జిమ్, ట్రెక్కింగ్, బోటింగ్, వాకింగ్ ట్రాక్, బ్యాటరీ సైక్లింగ్, వన్యప్రాణుల విశిష్టతను వివరించే విజ్ఞాన కేంద్రాలు, ఎన్నో రకాల పక్షుల బొమ్మలు, బటన్ నొక్కగానే పలు రకాల పక్షుల అరుపులు, పచ్చని అడవి అందాలను వీక్షించేందుకు వాచ్ టవర్, వివిధ రకాల ఆయుర్వేద మొక్కలు, అలసి పోతే సేద దీరేందుకు అక్కడక్కడ పుట్టగొడుగుల ఆకారంలో ఉండే పగోడాలు, ధ్యానం చేసుకునే వారికి ప్రత్యేకంగా ధ్యాన కేంద్రాలు, కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసేందుకు క్యాంటీన్, పిల్లల కోసం ప్రత్యేకంగా పార్కులు, ఎన్నో రకాల ఆట వస్తువులు ఇలా ఎన్నో నగర వనాల్లో ఏర్పాటు చేయనున్నారు. నామమాత్రపు ఫీజు (పిల్లలకు రూ.10, పెద్దలకు రూ.20)తో ప్రవేశించి అక్కడ రోజంతా సంతోషంగా గడపవచ్చు.

నాలుగు మంజూరు



ప్రజలకు ఆహ్లాదం పంచడంతో పాటు ప్రకృతిని కాపాడుకోవడం, అడవులపై అవగాహన కల్పించాలన్న ముఖ్య ఉద్దేశంతో ప్రభుత్వం నగర వనాలను ఏర్పాటు చేస్తోంది. జిల్లాకు నాలుగు మంజూరయ్యాయి. అటవీశాఖ పర్యవేక్షణలో వీటి ఏర్పాటు, నిర్వహణ ఉంటాయి. ఒక్కొక్క నగరవనం 50 హెక్టార్లలో ఏర్పాటు చేస్తాం. ప్రకృతి ప్రేమికులతో పాటు పిల్లలు, పెద్దలు, వృద్ధులు, మహిళలు ఇలా అందరూ అక్కడ రోజంతా హ్యాపీగా గడపవచ్చు. – రవీంద్రారెడ్డి, జిల్లా అటవీశాఖ అధికారి (డీఎఫ్ఓ)

సంతోషంగా ఉంది



బత్రేపల్లితో పాటు జిల్లాలో 4 చోట్ల నగర వనాలు ఏర్పాటు చేయాలని జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సంతోషదాయకం. నగరాలకే పరిమితమైన వాటిని నియోజకవర్గ స్థాయిలోనూ ఏర్పాటు చేయడం శుభ పరిణామం. ప్రజల సంక్షేమంతో పాటు మానసికోల్లాసం కోసం ప్రభుత్వం నగర వనాలు ఏర్పాటు చేయాలను కోవడం ప్రశంసించదగ్గ విషయం. – సుబ్బరాయుడు, ఏడీ సీసీ బ్యాంకు రిటైర్డ్ డీజీఎం, కదిరి



పిల్లల ఆటవిడుపు కోసం నగర వనంలో ఏర్పాటు చేయనున్న పరికరాలు



బత్రేపల్లి జలపాతం : నగరవనం ఏర్పాటు కానున్నది ఇక్కడే

తొలగిన బాలారిష్టాలు

- మద్దికెర – గుంతకల్లు బైపాస్ లైన్ రైలు మార్గం సిద్ధం
- అనుమతులు రాగానే రైళ్ల రాకపోకలు ప్రారంభం



మద్దికెర-గుంతకల్లు రైలు మార్గాన్ని తనిఖీ చేస్తున్న భద్రతా కమిషనర్, డీఆర్ఎం, ఇతర అధికారులు

గుంతకల్లు: దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న మద్దికెర– మల్లప్పగేట్ – గుంతకల్లు నార్త్ లైన్ లింక్ పనులకు ఎట్టకేలకు బాలారిష్టాలు తొలిగాయి. గుంటూరు – గుంతకల్లు ప్రధాన రైలు మార్గంలోని డోన్–గుంతకల్లు సెక్షన్‌లో మద్దికెర–మల్లప్పగేట్–గుంతకల్లు మధ్య దాదాపు 11 కిలోమీటర్ల డబ్లింగ్, విద్యుద్దీకరణ పనులు పూర్తయ్యాయి. భద్రతా కమిషనర్ ప్రణ్‌జీవ్ సక్సేనా, రైల్వే నిర్మాణాల విభాగం, సిగ్నల్ అండ్ టెలికామ్, ఎలక్ట్రిఫికేషన్ అధికారులు, డీఆర్ఎం మనీష్ అగర్వాల్ తదితరుల నేతృత్వంలో సంయుక్తంగా చేపట్టిన తనిఖీలు మంగళవారం ముగిశాయి. తొలుత ప్రత్యేక రైలు, తర్వాత మోటార్ ట్రాలీలో రైలు మార్గాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కమ్మీల మధ్య స్లీపర్లను పరిశీలించి కంకర నిర్ణీత సైజులో వేశారా లేదా అని సరిచూశారు. మోరీలు, ఆర్‌యూబీల నాణ్యత ప్రమాణాలు పరిశీలించారు. పవర్‌కార్ (విద్యుద్దీకరణ లైన్లు పరిశీలించే రైలు ఇంజిన్)లో విద్యుత్ లైన్‌ను తనిఖీ చేశారు. చివరగా వేగ నిర్ధారణ పరీక్షలో భాగంగా ప్రత్యేక రైలును దాదాపు 100 కి.మీ.కు పైగా స్పీడ్‌తో పరుగులు పెట్టించారు. ఈ మార్గంలో రైళ్ల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులూ లేవని నిర్ధారించిన భద్రతా కమిషనర్ సక్సేనా తనిఖీ నివేదికలను రైల్వే జీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అక్కడి నుంచి అనుమతులు వచ్చిన వెంటనే ఈ మార్గంలో రైళ్ల రాకపోకలు ప్రారంభిస్తామన్నారు. తనిఖీల్లో సీనియర్ డీఎస్‌టీఈ వైపీ రెడ్డి, సీనియర్ డీఓఎం శ్రావణ్, సీనియర్ డీఈఎన్ సంజీవ్‌కుమార్, సీనియర్ డీఈఈ గంగరాజు, సీనియర్ డీఎస్ఓ చంద్రశేఖర్, సీనియర్ డీఈటీఆర్‌డీ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

షంటింగ్‌కు స్వస్తి

మద్దికెర – గుంతకల్లు బైపాస్ లైన్ రైలు మార్గం అందుబాటులోకి వస్తే గుంతకల్లు జంక్షన్ గుండా వివిధ ప్రాంతాలకు వెళ్లే రైళ్లకు షంటింగ్ చేపట్టాల్సిన అవసరం ఉండదు. నేరుగా జంక్షన్‌లోకి ప్రవేశించే వీలు కలుగుతుంది. రైళ్ల రాకపోకల సమయం ఆదా కావడంతోపాటు ప్రయాణికులు వేచిచూడాల్సిన అవసరం కూడా ఉండదన్నారు.

'ఓపెన్' ఫలితాలు విడుదల

ప్రశాంతి నిలయం: సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్ స్కూల్) పదో తరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. జిల్లాలో పదో తరగతిలో మొత్తం 544 మంది పరీక్షలు రాయగా, 430 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే ఇంటర్‌లో 695 మంది పరీక్షలు రాయగా, 525 మంది ఉత్తీర్ణులయ్యారు. www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌లో మార్కుల జాబితాలు అందుబాటులో ఉంచారు. ఈనెల 26 నుంచి ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభమవుతాయని, అడ్మిషన్లు పొందేందుకు సెప్టెంబర్ 25 చివరి తేదీగా నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.

'పురం'లో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేద్దాం

- పార్టీ విజయానికి అందరం కలసికట్టుగా పనిచేద్దాం
- సమన్వయకర్త దీపిక, పార్టీ నాయకురాలు మధుమతిరెడ్డి

హిందూపురం: 2024 ఎన్నికల్లో హిందూపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా అందరం సమష్టిగా పనిచేద్దామని ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, నాయకురాలు మధుమతిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం వారు చౌళూరు గ్రామంలోని మధుమతిరెడ్డి నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమన్వయకర్త దీపిక మాట్లాడుతూ... వైఎస్సార్ సీపీ నేత చౌళూరు రామకృష్ణారెడ్డి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానన్నారు. పార్టీ గెలుపునకు మధుమతిరెడ్డి కలిసి నడుస్తామని చెప్పడం వైఎస్సార్‌సీపీ కుటుంబసభ్యులందరికీ సంతోషదాయకమన్నారు. పార్టీ నాయకులు మధుమతిరెడ్డి మాట్లాడుతూ.. జగనన్నను మరోసారి సీఎంగా చేసుకోవడం కోసం అందరూ కలసికట్టుగా పార్టీ విజయం కోసం పనిచేయాలన్నారు. ఇన్నాళ్లు గ్రూపులతో చాలా నష్టపోయామని, ఇప్పటికైనా అందరం కలసికట్టుగా పనిచేస్తే తప్పకుండా విజయం సాధిస్తామన్నారు. .తన తమ్ముడు రామకృష్ణారెడ్డి విలువలతో కూడిన రాజకీయాలు చేశారని, అదే రీతిలో తామూ నడుచుకుంటామన్నారు. పార్టీ అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి పని చేస్తామన్నారు. 2024లో జగనన్నను సీఎం చేయడమే తమ లక్ష్యమన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వేణురెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, కౌన్సిలర్లు శివ, మారుతిరెడ్డి, ఆసీఫ్‌వుల్లా, రామచంద్ర, షాజియా, నాగమణి, నాగేంద్రమ్మ, రోషన్‌అలీ, నాగరాజు, ఎంపీపీలు కృష్ణవేణి, పురుషోత్తంరెడ్డి, సర్పంచ్ నంజప్ప, మండల కన్వీనర్లు శ్రీరాంరెడ్డి, నారాయణస్వామి, కార్పొరేషన్ డైరెక్టర్లు నాగమణి, జనార్దన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, నాయకులు లోకేష్‌రెడ్డి, రాము, ఆర్‌కె ఖలీల్, సుధాకర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, రంగనాథ్, రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సమన్వయకర్త దీపిక, మధుమతిరెడ్డి

రైతు సంక్షేమమే లక్ష్యం

- ఆహారశుద్ధి పరిశ్రమలతో రైతులకు ఎంతో మేలు
- కలెక్టర్ అరుణ్‌బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ
- రూ.77.97 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఆహార శుద్ధి పరిశ్రమలకు శంకుస్థాపన
- వర్చువల్‌గా భూమిపూజ చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

పుట్టపర్తి అర్బన్: రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని కలెక్టర్ అరుణ్ బాబు తెలిపారు. ఈ క్రమంలోనే జిల్లాలో రూ.77.97 కోట్లతో రెండు ఆహార శుద్ధి పరిశ్రమలు ఏర్పాటు చేస్తోందన్నారు. ధర్మవరం మండలం గరుడంపల్లిలో ఏర్పాటు చేయనున్న వేరుశనగ సెకెండరీ ప్రాసెసింగ్ యూనిట్, చెన్నేకొత్తపల్లిలో ఏర్పాటు చేయనున్న ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్‌కు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్ బాబు సీఎం వైఎస్ జగన్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. జిల్లాలో లక్షలాది మంది రైతులు వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారని, అత్యధికంగా వేరుశనగ సాగు చేస్తున్నారని తెలిపారు. ధర్మవరం మండలం గరుడంపల్లిలో వేరుశనగ సెకెండరీ ప్రాసెసింగ్ యూనిట్, చెన్నేకొత్తపల్లిలో ప్రైమరీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు వల్ల ఎంతో మంది రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఇందుకు జిల్లా రైతులు, ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

250 మందికి ఉపాధి

కలెక్టరేట్ జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్ బాబు, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు అవుటాల రమణారెడ్డి తదితరులు జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతుల సమక్షంలో రెండు ఆహారశుద్ధి పరిశ్రమలకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్, జెడ్పీ చైర్ పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ.. గరుడంపల్లిలో రూ.72.47 కోట్లతో వేరుశనగ సెకెండరీ ప్రాసెసింగ్ యూనిట్, చెన్నేకొత్తపల్లి సమీపంలోని టింబక్టు కలెక్టివ్ ధరణి సొసైటీ ప్రాంగణంలో రూ.5.5 కోట్లతో కూరగాయలు, పండ్లు, గ్రేడింగ్, ప్యాకింగ్ వసతి కేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో టమాట సాగు చేసే రైతుల పంటకు ధరల స్థిరీకరణకు ఇవి ఎంతో ఉపయోగపడతాయన్నారు. వేరుశనగ సెకండరీ ప్రాసెసింగ్ యూనిట్‌తో విలువ ఆధారిత ఉత్పత్తులైన చిక్కీలు, నూనె, పీనట్ బటర్, రోస్టెడ్ సాల్టెడ్ పీనట్స్ తయారీ వల్ల దాదాపు 15 వేల మంది రైతులకు లబ్ధి చేకూరనున్నట్లు చెప్పారు. ఈ యూనిట్ల ద్వారా 250 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. జిల్లాలో సుమారు రెండున్నర లక్షల టన్నుల వేరుశనగ ఉత్పత్తి జరుగుతున్న తరుణంలో రైతులకు మార్కెటింగ్ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. 11.10 ఎకరాల్లో ఏర్పాటు కానున్న పరిశ్రమలో రోజుకు 266 టన్నుల చొప్పున ఏడాదికి 55,620 మెట్రిక్ టన్నుల వేరుశనగ ప్రాసెసింగ్ చేస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, సీకే పల్లి జెడ్పీటీసీ సభ్యుడు గోవిందరెడ్డి, ఎంపీపీ అంజలి, ఏడీఏ కృష్ణయ్య, ఉద్యాన అధికారి అమరేశ్వరి, జిల్లా ఆహార శుద్ధి పరిశ్రమల రిసోర్స్ పర్సన్ హరీష్, ఉప్పనేసినపల్లి సర్పంచ్ ముత్యాలప్ప పాల్గొన్నారు.

జగన్ రైతు పక్షపాతి



రైతుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్ రైతు పక్షపాతిగా గుర్తింపు పొందారు. సీకేపల్లిలో ఏర్పాటు చేసే కూరగాయల ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా టమాట పండించే మాలాంటి ఎందరో రైతులకు మేలు జరుగుతుంది. పంటకు గిట్టుబాటు ధర లభిస్తుంది. జీవితాంతం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం. – నాగమణి, మహిళా రైతు, రొద్దం

రైతుల అదృష్టం



ధర్మవరం మండలంలో వేరుశనగ సెకండరీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు రైతుల అదృష్టం. పరిశ్రమ నెలకొల్పడంతో యువతకు ఉపాధి అవకాశాలతో పాటు వేరుశనగకు మంచి డిమాండు ఉంటుంది. ఈ పరిశ్రమ రాకతో వేరుశనగకు గిట్టుబాటు ధరలు లభిస్తుంది. లక్షలాది మంది రైతులకు మేలు జరుగుతుంది. – బుల్లెట్ నాగార్జున, రైతు, కనుముక్కల

జగన్‌కు రుణపడి ఉంటాం



జిల్లాలో సుమారు రూ.77 కోట్లతో రెండు పరిశ్రమలు ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం ఆనందంగా ఉంది. పరిశ్రమలు పూర్తయితే పంటకు గిట్టుబాటు ధర లభిస్తుంది. యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. రైతులకోసం మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం. – అశోక్‌రెడ్డి, రైతు, లోచర్ల

పోలీస్ వ్యవస్థపై నమ్మకం కలిగిద్దాం

- రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిఘా ఉంచాలి
- నేర సమీక్షలో డీఐజీ అమ్మిరెడ్డి
- సమన్వయంతో పనిచేద్దామని కలెక్టర్, ఎస్పీ పిలుపు



మాట్లాడుతున్న అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి

పుట్టపర్తి టౌన్: ప్రజలకు మెరుగైన సేవలందించి పోలీసు వ్యవస్థపై నమ్మకం, విశ్వాసం కలిగేలా పోలీసుశాఖలోని ప్రతి ఒక్కరూ పనిచేయాలని అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పుట్టపర్తిలోని సాయిఆరామంలో జిల్లా అర్ధవార్షిక నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ అరుణ్‌బాబు, అనంతపురం రేంజ్ డీఐడీ అమ్మిరెడ్డి, ఎస్పీ మాధవరెడ్డి పాల్గొన్నారు. గత ఆరు నెలల్లో జిల్లాలో నమోదైన కేసులు, దర్యాప్తు తీరు, కేసుల పురోగతిపై ఆరా తీశారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన 85 మంది పోలీస్ సిబ్బందికి డీఐజీ, ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా డీఐజీ అమ్మిరెడ్డి మాట్లాడుతూ, పోలీసులు విధి నిర్వహణలో ఇతర ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుని ముందుకు సాగాలన్నారు. నేరస్తులు ఎవరైనా, ఎంతటివారైనా చట్ట పరిధిలో శిక్ష పడేలా దర్యాప్తు చేపట్టాలన్నారు. కోర్టులో కేసులు వీగి పోకుండా సాక్ష్యాధారాలు సమర్పించాలన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు, చార్జ్‌షీట్ దాఖలులో అలసత్వం పనికిరాదన్నారు. పలు కేసుల్లో కోర్టు ఇస్తున్న తీర్పులను ఎప్పటికప్పుడు తెలుసుకొని అవగాహన పెంచుకోవాలన్నారు.

సమన్వయంతో పనిచేద్దాం

కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ, జిల్లాలో రెవెన్యూ, పోలీస్ శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా సమన్వయంతో కార్యాచరణ రూపొందించుకుని ముందుకు వెళ్దామన్నారు. పోలీస్ అధికారులు పల్లె నిద్రలో భాగంగా గ్రామాలకు వెళ్లినప్పుడు స్థానిక సమస్యలతో పాటు బాల్య వివాహాలు, మహిళా చట్టాలు, ఫోక్సో కేసులపై కూడా అవగాహన కల్పించాలన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలి

ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారించి, వాహన చోదకులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. తరచూ ప్రమాదాలు చోటుచేసుకునే ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజల్లో పోలీసుల పట్ల నమ్మకం, విశ్వాసం పెంపొందించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. రౌడీ షీటర్లు, పాత నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే మట్కా, ఎర్ర చందనం, ఎన్‌డీపీఎస్ కేసులను ప్రాధాన్యతగా గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ విష్ణు, సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్, ఆర్టీఓ సురేష్‌తో పాటు పలువురు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సెబ్ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉర్దూ టీచర్ల కొరతను అధిగమిస్తాం



మాట్లాడుతున్న సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు

కదిరి అర్బన్: పాఠశాలలో ఉర్దూ టీచర్ల కొరతను అధిగమించేందుకు నూతనంగా 250 మంది ఉర్దూ ఉపాధ్యాయులను నియమిస్తున్నట్లు ఏపీ సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మున్సిపల్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న భాషా నైపుణ్య శిక్షణ తరగతులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ.. ఇంగ్లిష్‌పై విద్యార్థులు పట్టు సాధించేలా విద్యాబోధన సాగాలన్నారు. ఇంగ్లిష్ ప్రాధాన్యతపై విద్యార్థులను చైతన్య పరచాలన్నారు. సమగ్ర శిక్ష మైనార్టీ కో ఆర్డినేటర్ అబ్దుల్, ఇన్‌చార్జ్ సీఎంఓ అబ్దుల్ మాలిక్, మండల విద్యాధికారి చెన్నకృష్ణ పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

రాప్తాడు రూరల్: నాయకత్వ లక్షణాలు పెంపొందించుకున్నప్పుడే ఏ కార్యక్రమాన్నైనా విజయవంతం చేయగలుగుతామని ప్రధానోపాధ్యాయులకు సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు సూచించారు. స్కూల్ నిర్వహణలో నాయకత్వ లక్షణాలపై ప్రధానోపాధ్యాయులకు అనంతపురం శివారులోని టీటీడీసీ కేంద్రంలో ఏర్పాటు చేసిన రెండో విడత శిక్షణ కార్యక్రమాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఏర్పాట్లు, మౌలిక సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. పునాది అభ్యసన, గణిత పరిజ్ఞానం, మౌలిక సదుపాయాల కల్పన, పాఠశాల వ్యవస్థను సక్రమంగా నడిపేలా ప్రధానోపాధ్యాయుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులందరికీ జగనన్న విద్యా కానుక కిట్లు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ సాయిరామ్, పెనుగొండ ఉపవిద్యాశాఖ అధికారి రంగస్వామి, రాష్ట్ర పరిశీలకులు పెంచలయ్య, అన్నపూర్ణమ్మ పాల్గొన్నారు.

నేటి నుంచి ఎంబీఏ నాల్గో సెమిస్టర్, పీజీ డిప్లొమా పరీక్షలు

రాప్తాడు రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరిధిలో ఎంబీఏ నాల్గో సెమిస్టర్, పీజీ డిప్లొమా కోర్సుల పరీక్షలు బుధవారం (నేడు) నుంచి జరగనున్నాయి. ఈ మేరకు అనంతపురం ఆర్ట్స్ కళాశాలలోని ప్రాంతీయ కార్యాలయం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎ.శేషారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. పూర్తి వివరాలకు 73829 29602లో సంప్రదించవచ్చు.

జూదరుల అరెస్ట్

హిందూపురం అర్బన్: మండలంలోని గోళ్లాపురం శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై స్పెషల్ పార్టీ, హిందూపురం రూరల్ పోలీసులు మంగళవారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.3,51,410 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నట్లు సీఐ కృష్ణారెడ్డి తెలిపారు.

తడబడినా... నిలబెడదాం

ఒక్క పరీక్షతో విద్యార్థి భవిష్యత్‌ను అంచనా వేయకూడదు. ఒక్క తరగతి ఫలితంతో వారి రాత మార్చేయకూడదు. రాష్ట్ర ప్రభుత్వం సరిగ్గా ఇదే ఆలోచించింది. పది, ఇంటర్‌లో ఫెయిల్ అయిన వారికి మరో అవకాశం కల్పించింది. 'బడికి రండి' బాబూ అంటూ పిలుస్తోంది. ఈ విద్యాసంవత్సరం (2023-24) తరగతులకు హాజరైతే 'అమ్మఒడి' తదితర పథకాలన్నీ అందజేస్తామని, ఉత్తీర్ణులైతే రెగ్యులర్‌గా చూపుతామని చెబుతోంది. ఈ మేరకు వలంటీర్లు ఇంటింటికీ తిరుగుతూ పది, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులను మళ్లీ బడిలో చేరుస్తున్నారు.

- జగన్ సర్కార్ విప్లవాత్మక నిర్ణయం
- పది, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు మరో అవకాశం
- మళ్లీ రెగ్యులర్‌గా చదువుకునేందుకు చర్యలు
- వారికీ 'అమ్మఒడి' సహా ఇతర పథకాలన్నీ వర్తింపు
- వలంటీర్ల సహకారంతో విద్యార్థుల గుర్తింపు



లేపాక్షి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అడ్మిషన్లు పొందిన పత్రాలు చూపుతున్న పదో తరగతి విద్యార్థులు

ప్రశాంతి నిలయం: పది, ఇంటర్‌లో ఫెయిల్ అయిన బాలలు ఆత్మన్యూనతా భావంతో కుంగిపోవటం, ఏదో ఒక పనిలో సంపాదనకు అలవాటు పడటం, చెడు స్నేహాలతో వ్యసనాలకు బానిసలవుతున్నారు. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను కూలీ పనులకు పంపడంతో, బాలికలకు పెళ్లిల్లు చేయడం వంటివి చేస్తుంటారు. ఫలితంగా వారి భవిష్యత్తు శూన్యంగా మారుతోంది. ఇలా అర్ధాంతరంగా విద్యార్థులు చదువులకు దూరం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పదో తరగతి, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు మళ్లీ బడికి, జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు కల్పించేందుకు ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. పది, ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులను గుర్తిస్తూ వారిని స్కూళ్లు, జూనియర్ కళాశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో వేలాది మంది పేద విద్యార్థులు చక్కగా చదువుకుని తిరిగి గాడిలో పడేందుకు అవకాశం ఏర్పడింది. ప్రభుత్వ నిర్ణయం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు, సామాజిక వేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేలాది మంది విద్యార్థులకు ప్రయోజనం

రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జిల్లా వ్యాప్తంగా వేలాది మంది పది, ఇంటర్ ఫెయిల్ అయిన పేద విద్యార్థులకు మేలు జరగనుంది. 2023 సంవత్సరంలో జిల్లాలోని 10,164 మంది విద్యార్థులు పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రాయగా, 5,873 మంది ఉత్తీర్ణత సాధించారు. 4,291 మంది ఫెయిల్ అయ్యారు. ఇక ఇంటర్మీడియెట్‌కు సంబంధించి ఇందులో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 6,064 మంది రెండో సంవత్సరం పరీక్షలకు హాజరు కాగా, 2,688 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. 3,376 మంది ఫెయిల్ అయ్యారు. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో ఫెయిల్ అయిన విద్యార్థులందరికీ మేలు జరగనుంది.

అమ్మ ఒడి, విద్యా కానుకకు అర్హులే....

పది, ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులకు రెగ్యులర్ తరగతులకు హాజరయ్యేందుకు అవకాశం కల్పించిన ప్రభుత్వం రెగ్యులర్ విద్యార్థులతో సమానంగా జగనన్న అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక కిట్లు, జగనన్న గోరుముద్దతో పాటు ప్రభుత్వం అందించే అన్ని ఇతర ప్రోత్సాహకాలు వీరికీ అందించాలని నిర్ణయించింది. అలాగే ఈ ఏడాది రెగ్యులర్‌గా తరగతులకు హాజరై పబ్లిక్ పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధిస్తే రెగ్యులర్ పాస్‌గానే పరిగణిస్తామని అధికారులు చెబుతున్నారు. దీంతో విద్యార్థి ఉన్నత చదువుల సీట్లు పొందేందుకు ఎంతగానో ఉపయోగపడనుంది.

వలంటీర్లు కీలకం

ఫెయిల్ అయిన విద్యార్థులను గుర్తించడంలో వలంటీర్ల వ్యవస్థ కీలకంగా పని చేయనుంది. విద్యార్థుల వివరాలు నమోదు చేసేందుకు వలంటీర్లకు ప్రత్యేకంగా స్టూడెంట్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎస్ఐఎంఎస్) 'యాప్' రూపొందించారు. వలంటీర్ల పరిధిలోని నివాసాల్లో ఉండే పిల్లల వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. యాప్ యూడైస్ పోర్టల్‌కు అనుసంధానం చేసి ఉంటుంది.

గొప్ప అవకాశం



పది, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు పునఃప్రవేశాలు కల్పిస్తూ ప్రభుత్వం వారికి గొప్ప అవకాశం కల్పించింది. అంతేకాకుండా తగిన సంఖ్యలో ఉపాధ్యాయులు, చక్కని మధ్యాహ్న భోజనం, చదువులు భారం కాకూడదనే అమ్మఒడి, ఆకర్షణీయంగా పాఠశాలలు, బాలికలకు కేజీబీవీలు ఇంకా విద్యా దీవెన, వసతి దీవెన లాంటి పథకాలతో ప్రోత్సహిస్తోంది. పిల్లలకు వీటిని సద్వినియోగం చేసుకుని ఎదగాలి. తల్లిదండ్రులూ ఆ మేరకు పిల్లలకు అవగాహన కల్పించాలి. – మీనాక్షి, డీఈఓ

రైల్వే జంక్షన్‌లో విస్తృత తనిఖీలు



ప్లాట్‌ఫాంపై తనిఖీ చేస్తున్న పోలీసులు

గుంతకల్లు: నేరాల నియంత్రణలో భాగంగా గుంతకల్లు రైల్వే జంక్షన్‌లో సివిల్, జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది మంగళవారం సాయంత్రం విస్తృత తనిఖీలు చేపట్టింది. గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప, జీఆర్పీ డీఎస్పీ అబ్దుల్‌అజీజ్, ఆర్పీఎఫ్ అధికారులు, దాదాపు 60 మంది స్పెషల్ పార్టీ పోలీసులు, డాగ్‌స్క్వాడ్‌తో కలసి రైళ్లలో, ప్లాట్‌ఫామ్‌లు, రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. అనుమానితుల వేలిముద్రలు సేకరించారు. కార్యక్రమంలో సీఐలు రామసుబ్బయ్య, గణేష్, జీఆర్పీ సీఐ నగేష్‌బాబు, ఆర్పీఎఫ్ బెన్నయ్య, ఎస్ఐలు సురేష్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బంగారం అపహరణ

ఎన్పీకుంట: మండలంలోని ఎస్.రెడ్డివారిపల్లికి చెందిన మాజీ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జి.పుల్లారెడ్డి ఇంటిలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఇటీవల ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి పుల్లారెడ్డి కడపలో నివాసముంటున్న కుమారుడి వద్దకు వెళ్లారు. ఈ విషయాన్ని గుర్తించిన దుండగులు సోమవారం రాత్రి తలుపులు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు. బీరువాలో దాచిన రూ.3.50 లక్షల నగదు, రూ.3లక్షల విలువ చేసే బంగారంతో పాటు విలువైన పత్రాలను అపహరించుకెళ్లారు. మంగళవారం ఉదయం ఇంట్లో నుంచి పొగలు వస్తుండడాన్ని గమనించిన సమీప బంధువులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. తలుపులు తీసి ఉండడంతో విషయాన్ని వెంటనే ఫోన్ చేసి పుల్లారెడ్డికి తెలపడంతో ఆయన ఆగమేఘాలపై తరలివచ్చారు. నగదు, బంగారం అపహరించుకెళ్లి, విలువైన పత్రాలను దహనం చేసినట్లుగా గుర్తించాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. క్లూస్ టీంను రంగంలో దించి వేలిముద్రలను సేకరించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

పావగడ: తాళం వేసిన ఇంట్లోకి దుండగులు చొరబడి విలువైన బంగారు నగలు అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... పావగడ తాలూకా పి.రొప్ప గ్రామానికి చెందిన బాబు సోమవారం ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి చెన్నేకొత్తపల్లి మండలం ముష్టికోవెల గ్రామానికి వెళ్లాడు. విషయాన్ని గుర్తించిన దుండగులు రాత్రి ఇంటి తలుపులు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు. బీరువాలో దాచిన రూ.2 లక్షల విలువైన బంగారు నగలు, రూ.3 లక్షల నగదు అపహరించుకెళ్లారు. ఇంటి తలుపులు బద్దలుగొట్టిన దృశ్యాన్ని మంగళవారం ఉదయం చూసిన పక్కింటి వ్యక్తి సమాచారం ఇవ్వడంతో బాబు, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ గురునాథ్ తెలిపారు.

అన్ని రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయాలి

- బెంగళూరు రైల్వే డివిజన్ కన్సూమర్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు డాక్టర్ తిప్పేస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ తిప్పేస్వామి

మడకశిర: జిల్లాలోని అన్ని రైల్వేస్టేషన్ల అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని సౌత్ వెస్టర్న్ రైల్వే (ఎస్‌డబ్ల్యూఆర్) బెంగళూరు డివిజన్ అధికారులను ఆ డివిజన్ కన్స్యూమర్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడి హోదాలో మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి కోరారు. ఎస్‌డబ్ల్యూఆర్ బెంగళూరు డివిజన్ సమావేశం మంగళవారం బెంగళూరులో జరిగింది. సమావేశంలో డీఆర్ఎం, ఏడీఆర్ఎం తదితర ఉన్నతాధికారులు, కమిటీ సభ్యులు పాల్గొని రైల్వే అభివృద్ధి, ప్రయాణికుల సమస్యలు, వాటికి పరిష్కారాలపై చర్చించారు. డివిజన్ రైల్వే కన్స్యూమర్ కన్సల్టేటివ్ సభ్యుడి హోదాలో ,స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామి పాల్గొని మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా రైల్వే స్టేషన్ల స్థితిగతులను వివరించారు. మెగా డెవలప్‌మెంట్ స్కీంలో భాగంగా హిందూపురం రైల్వే స్టేషన్‌ను పూర్తి స్థాయిలో ఆధునికీకరించాలని కోరారు. జిల్లాలోని అన్ని రైల్వే స్టేషన్లలోని ప్లాట్‌ఫాంలతో పాటు మరుగుదొడ్లు, వెయిటింగ్ రూములు మెరుగు పరచాలన్నారు. హిందూపురంలో అన్ని రకాల ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపడంతో పాటు అక్కడి నుంచి బెంగళూరుకు ప్రత్యేకంగా ఇంటర్ సిటీ ప్యాసింజర్ రైళ్లను పెంచాలని సూచించారు. మడకశిర మీదుగా నిర్మిస్తున్న రాయదుర్గం-తుమకూరు రైల్వేలైన్ పనులు వేగవంతం చేయాలని కోరారు. కాగా, ఎమ్మెల్యే తిప్పేస్వామి సూచనలపై రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

హోంగార్డు సస్పెన్షన్

కళ్యాణదుర్గం: కంబదూరు పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డు శివానందను సస్పెండ్ చేస్తూ ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇటీవల కంబదూరు పోలీసు స్టేషన్‌కు న్యాయం కోసం వెళ్లిన మహిళ పట్ల హోం గార్డు అసభ్యంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదులు అందాయన్నారు. దీనిపై విచారణ అనంతరం హోంగార్డును సస్పెండ్ చేస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారన్నారు.పోలీసు స్టేషన్‌కు వచ్చే వారి పట్ల సిబ్బంది గౌరవంగా వ్యవహరించాలన్నారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమన్నారు.

ప్రాజెక్టులకు జలసవ్వడి

- తుంగభద్రకు భారీగా, శ్రీశైలంకు నిలకడగా ఇన్‌ఫ్లో

అనంతపురం సెంట్రల్: భారీ వర్షాల కారణంగా తుంగభద్ర, శ్రీశైలం ప్రాజెక్టులు జలకళ సంతరించుకుంటున్నాయి. కర్ణాటకలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. తుంగభద్ర జలాశయానికి 72,488 క్యూసెక్కుల భారీ ఇన్‌ఫ్లో వస్తోంది. 105.788 టీఎంసీల సామర్థ్యమున్న టీబీ డ్యాం ప్రస్తుతం 31.658 టీఎంసీల నీటిమట్టానికి చేరుకుంది. ఇన్‌ఫ్లో గణనీయంగా వస్తుండడంతో రోజుల వ్యవధిలోనే పూర్తిస్థాయి మట్టానికి నీటి నిల్వ చేరుకుంటుందని అధికారులు వెల్లడిస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి నిలకడగా వరద నీరు వస్తోంది. ఎగువన ఉన్న జూరాల ప్రాజెక్టు నుంచి నీటిని దిగువకు వదిలేస్తుండడంతో 27,979 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 215 టీఎంసీలు నీటి సామర్థ్యం కాగా ప్రస్తుతం 36.66 టీఎంసీల నీరు ఉంది.

కడుపు నొప్పి తాళలేక గర్భిణి ఆత్మహత్య

- మృతురాలు కుటాగుళ్ల వార్డు వలంటీర్



మృతురాలు అశ్విని

కదిరి టౌన్: కడుపునొప్పి తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... కదిరి మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్లకు చెందిన విష్ణువర్ధన్‌కు ఐదేళ్ల క్రితం అదే ప్రాంతానికి చెందిన అశ్విని(27)తో వివాహమైంది. వీరికి రెండేళ్ల వయసున్న కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం ఆమె గర్భంతో ఉంది. గ్రామ వలంటీర్‌గా పనిచేస్తున్న అశ్విని కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతోంది. మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో కడుపునొప్పి రావడంతో భరించలేక విషపూరిత ద్రావకం తాగింది. కాసేపటి తర్వాత ఇంటికి చేరుకున్న కుటుంబసభ్యులు అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను గమనించి, వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆమె మృతి చెందింది. మృతురాలి తండ్రి రామచంద్ర ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ మగ్బూల్‌బాషా తెలిపారు

వలంటీర్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

కదిరి మున్సిపాలిటి పరిధిలోని 36వ వార్డు వలంటీర్‌గా పనిచేస్తున్న పి.అశ్విని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలుసుకున్న కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి దిగ్భ్రాంతికి లోనయ్యారు. వెంగనే స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి చేరుకుని వలంటీర్ అశ్విని మృతదేహాన్ని పరిశీలించి, నివాళులర్పించారు. ఘటనపై కుటుంబసభ్యులతో ఆరా తీశారు. అధైర్య పడొద్దని, ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసానిచ్చారు.

తండాలో సిలిండర్ పేలుడు

- నలుగురు మహిళలకు తీవ్ర గాయాలు



గాయపడిన ఆర్.వి.సరోజమ్మ

వజ్రకరూరు: వెంకటాంపల్లి పెద్దతండా (రూప్లానాయక్ తండా)లో గ్యాస్ సిలిండర్ పేలింది. ఈ ఘటనలో నలుగురు మహిళలు గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు... తండాకు చెందిన ఆర్.వి.సరోజమ్మ ఇంటిలో మంగళవారం రాత్రి గ్యాస్ సిలిండర్ అయిపోయింది. మరొక సిలిండర్‌కు రెగ్యులేటర్ అమర్చేందుకు రాకపోవడంతో పక్కింటి వారి సహకారంతో పూర్తి చేశారు. అనంతరం స్టౌ వెలిగించబోతే సిలిండర్ పేలి భారీ శబ్దం వచ్చింది. ఈ ప్రమాదంలో ఆర్.వి.సరోజమ్మ, ఆర్.వి. మాధవితో పాటు పక్కింట్లోని వారు ఆర్.దేవమ్మ, ఎస్.సరోజ తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు ధాటికి కిచెన్ గది పైకప్పు ధ్వంసమైంది. వస్తువులన్నీ చెల్లాచెదురుగా ఎగిరిపడ్డాయి. గ్రామస్తులు అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టి.. గాయపడిన నలుగురు మహిళలనూ 108 వాహనంలో ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నలుగురినీ మెరుగైన వైద్యం కోసం అనంతపురం సర్వజనాస్పత్రికి పంపించారు. ఎస్ఐ రాజశేఖర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి, ప్రమాదానికి దారి తీసిన కారణాలపై ఆరా తీశారు.

మెరుగైన వైద్య పరీక్షలు అందించండి

గ్యాస్ ప్రమాదం గురించి సమాచారం అందుకున్న ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఫోన్ ద్వారా బాధితుల కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఉరవకొండ ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారులకు ఫోన్ చేసి, మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. క్షతగాత్రులను ఉరవకొండ నుంచి అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ఎంపీపీ రమావత్ దేవి, సర్పంచ్ శివాజీనాయక్, వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు బసవరాజు, నాయకులు కురుబ గోవిందు, శంకర్ తదితరులు వాహనాలు సమకూర్చారు.

- కుళ్లాయిస్వామి

నమోనమః



గూగూడు జనసంద్రమైంది. మొహర్రం సందర్భంగా కుళ్లాయి స్వామి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం రాత్రి నుంచే గూగూడు భక్తులతో కిక్కిరిసిపోయింది. మంగళవారం జంట ఆలయాల వద్ద దైవ దర్శనానికి భక్తులు బారులు తీరారు. చక్కెర చదివింపులతో మొక్కులు తీర్చుకున్నారు. కుళ్లాయి స్వామి నమోనమః అంటూ భక్తిశ్రద్ధలతో భక్తులు కీర్తించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



గూగూడులో దర్శనమిస్తున్న కుళ్లాయిస్వామి పీర్లు



భద్రతను పర్యవేక్షిస్తున్న పోలీసులు



పీర్ల చావిడి ఎదుట మండుతున్న అగ్నిగుండం



గూగూడులో వెలసిన దుకాణాలు



స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు



గాజులు కొనుగోలు చేస్తున్న మహిళలు